# సినీ బేతాళ కథలు





- డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 34 -

### - వూరువే చూష్కోవా -

**విక్రమార్కుడు** మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

"విక్రా! దారిలో నీకు శ్రమ అనిపించకుండా వుండేందుకు మరో కథ చెబుతాను విను!" - అని బేతాళుడు ప్రారంభించాడు.

- హంగుబాబు అనే నిర్మాత దర్శకుడు రంగుల్లో హంగులతో అనేక చిత్రాలు తీశాడు. తీసే కొత్తలో కొన్ని సినిమాలు బాగానే ఆడాయి. కానీ క్రమంగా అంతగా ఆడలేక అదర్‌చిత్రాల ధాటికి తట్టుకోలేక వరసగా ఫెయిలయిపోసాగాయి. ఏం చెయ్యాలో పాలుపోక ఏం చేస్తే బాగుంటుందని సాటి నిర్మాతల్ని సలహా అడిగాడు. అంతా ఏకగ్రీవంగా - 'నాయినా హంగుబాబూ! బంజారా హిల్స్‌లో తెలుగు సినిమాలు తీసి తీసి అలిసి సొలసి ఆస్తులన్నీ కరిగించుకుని రిటైరై సన్యసించిన, గంగులు బాబా అనే స్వామీజీ వున్నారు. వారు దెబ్బతిన్న చిత్ర నిర్మాతలకు అమూల్యమైన సలహాలిస్తూ వుంటారు. మా సినిమాలు ఫెయిలయినప్పుడు ఆయన్నే ఆశ్రయించాం. వారి సలహాలు పాటించి కాస్త పుంజుకున్నాం. అంచేత నువ్వుకూడా వారి దర్శనం చేసుకుని మంచి ఫలితం సాధించు!'- అని సలహా యిచ్చారు. వెంటనే హంగుబాబు, బంజారాహిల్స్‌లో గంగులు బాబా ఆశ్రమానికి వెళ్లాడు. ఆశ్రమం అతి ప్రశాంతంగా సత్యజిత్‌రే సినిమా ఆడుతున్న థియేటర్‌లా వుంది. సెన్సారువారు జంతువు సీన్లు కట్ చేస్తూ వుండడంవల్ల, వేషాల్లేని కోతులు, కుక్కలు, జింకలు, ఆవులు, గేదెలు, కోడిపుంజులూ అటూయిటూ తిరుగుతూ వొక చిన్న సఫారీ పార్కులా కూడా వుంది.

అక్కడా, అక్కడా చెట్లకింద అప్పులపాలైన నిర్మాతలు, పాత ఫిలిం రిబ్బన్లు మెళ్లో వేసుకుని హిట్టోస్మి! హిట్టోస్మి అని గొణుక్కుంటూ గొణుగుడు ధ్యానంలో వున్నారు. కొంతమంది వేషాల్లేని నటులు తుప్పల్లో దూరి యిరగదీస్తా, ఫిక్స్‌యిపోతా, లెగిసిరా పేవించుకుందాం అంటూ రొటీన్ డైలాగులు మననం చేసుకుంటున్నారు. ఆశ్రమం పూర్‌గుడిసెలో కాళ్లకి తాడు కట్టుకుని గంగులు బాబా తల్లక్రిందులుగా వ్రేళ్లాడుతున్నాడు.

నిర్మాత దర్శకుడు హంగుబాబు గుడిసెలో ప్రవేశించాడు. 'రా! నాయనా రా!' అంటూ గంగులు బాబా సాదరంగా హంగుబాబుని ఆహ్వానించాడు 'ఏవిటి నీ కష్టం?' అని అడిగాడు.

'స్వామీ! మీరిలా రివర్స్‌లో నిలబడితే నా రీసెంట్ చిత్రం సక్సెస్ రిజల్టు గుర్తొస్తోంది. తవరు ముందు కాళ్లుకిందులైతేగానీ నా కష్టము చెప్పజాల!' అన్నాడు హంగుబాబు.

అప్పుడు గంగులు బాబా కాళ్ల తాళ్లు విప్పుకుని మాములు పొజిషన్‌లోకి వస్తూ - 'తాగడానికి మందులేదు. తాగిన మందంతా తల్లోంచి కాళ్లలోకి వెళ్లిపోయింది. దాన్ని మళ్లీ తల్లోకి యెక్కించుకోడానికి యీ ఆసనం కనిపెట్టా. యిప్పుడు చెప్పు!' అనడిగాడు.

'ఏవీలేదు - సన్యాసిస్వామీ! నా దగ్గరిప్పుడు ఏవీలేదు. నా సినిమాలు వరసగా ఫెయిలయిపోతున్నాయి. నా తాజా చిత్రం కూడా బతకలేదు. నేను కూడా సన్యాసినయిపోయాను.'

'పిచ్చివాడా! నీవు సన్యాసివికాలేదు. కానీ సన్నాసివి అయావు. నాలా అందర్నీ త్యజించినవాడు సన్యాసి. నీలా అందరిచేతా వదిలేయబడినవాడు సన్నాసి. యకారానికి నకారానికి తేడా గ్రహించు ముందు.'

'సరేస్వామీ! కారాల సంగతి సరే. నేనిప్పుడు బతికి హిట్టు కట్టాలంటే ఏవిటిదారి?'

'చాలా సింపుల్ నాయనా! తెలుగువాడికి పరాయి మోజు యెక్కువ. అంతా తెలుగమ్మాయిల్ని మానేసి అదరమ్మాయిల్ని హీరోయిన్స్‌గా పెట్టి తెలుగు సినిమాలు తీస్తున్నారు. నువ్వు యింకో మెట్టుపైకి యెక్కి అన్యరాష్ట్ర కన్యల్ని కాకుండా, అన్యదేశపు అదిరే అదర్ కన్యల్ని నీ చిత్రాల్లో హీరోయిన్స్‌గా పెట్టి యింకాసిని అప్పులు చేసి గొప్ప చిత్రం తీయుము. అపుడు నీకు విజయము తథ్యము!' - అని వుపదేశించాడు గంగులుబాబా.

'ధన్యోస్మి స్వామీ! ధన్యోస్మి! తమరు చెప్పినట్టే చేస్తాను. నా కొత్త సినిమా హిట్టవగానే తీర్థప్రసాదాలతో తమ దర్శనం చేసుకుంటాను. అందాకా యిదుగో యీ నీలం సంజీవి బుడ్డి' - అనగా బ్లూలేబిల్ దక్షిణ సమర్పించుకుని, గంగులు బాబా ఆశ్రమం విడిచి విశాల తెలుగు సినిమా ప్రపంచంలోకి అడుగెట్టాడు హంగుబాబు.

తన కొత్త సినిమా హీరోయిన్ కోసం దేశాలన్నీ తిరిగి తిరిగి యెగిరి యెగిరి గాలించి యెంతోమంది విదేశీ హీరోయిన్స్‌ని వెదికి వెదికి చివరికి వొక రష్యా పిల్లను ఖరారు చేసుకున్నాడు. ఆమె పేరు 'వూరువే చూష్కోవా!' పిల్ల యేపుగా యెగిసి వూగే అందాలతో యెగబడి చూసేలా వుంటుంది. ఆమెను హైదరాబాదుకి తీసుకొచ్చాక ఆమెకు నగరం బాగా నచ్చింది. తెలుగు సినీవాతావరణం యింకా నచ్చింది.

హంగుబాబు, వూరువే చూష్కోవాతో తీసిన రెండు సినిమాలు బాగానే ఆడాయి. ఆమెకు తెలుగు సినిమాలన్నా, తెలుగన్నా బాగా మోజు పెరిగింది. కష్టపడి వచ్చీరాని తెలుగు చాలా నేర్చుకుంది.

వూరువే చూష్కోవా అంటే హంగుబాబుకి కూడా బాగా మోజు పెరిగింది. ఆమెను అన్నికోణాల్లోనూ ముందూవెనకా అత్యాకర్షణీయంగా చిత్రీకరిస్తుంటే ప్రేక్షకులు పులకింతలతో పరవశలవుతున్నారు. సన్నటి నడుము, వూరించే వక్షోజాలు, వురకలేయించే వూరువులతో చూష్కోవా చూడచక్కగా యెవర్నీ రెప్పలు వాల్చనీయలేదు. చూష్కోవాకి హంగుబాబుకీ వయసులో బాగా తేడా వుంది. ఆమె యంగ్ అండ్ హాట్. హంగుబాబు వోల్డ్ అండ్ వోవర్ డిజైరసమయుడ్ ఇద్దరికీ నెమ్మదిగా కనెక్షన్ కుదిరింది. అది స్పీడుగా పెరిగింది. ఇద్దరూ దగ్గరవుతున్నకొద్దీ హంగుబాబు వ్యామోహం వరదై పొంగసాగింది.

ఇరవైనాలుగ్గంటలూ 'వూరువే వొక్కసారి వెనక్కి తిరుగు. చూష్కోవా అటు తిరుగు' అని ఆమె ప్రాణం తీయడం మొదలెట్టాడు. ఆమె 'వైష్కో? హంగుష్కా!' అని అడిగేది. అందుకతను

'నీ వెనక అందాలు నన్ను వెర్రెక్కించేస్తాయి. ముందునుంచి కంటే వెనకనుంచి నిన్ను చూస్తే మతిపోతుంది చూష్కోవా' అనసాగాడు.

'అలాగష్కా!' - అంటూ ఆమె ఆనందం, విసుగూ వొలకబోష్కిది.

కొన్నాళ్లకు హంగుబాబుకి వయసుపెరిగి, నడుం పట్టేసి మంచం యెక్కాడు. నిర్మాణం, నటన, దర్శకత్వం అన్నీ చూష్కోవానే చూసుకోసాగింది. ఆమె మంచి వయసులో వుంది. హంగుబాబు ఆమె కోరికల్ని తీర్చగలిగే స్థితిలోలేడు. అయినా ఆమెను అస్తమానం 'వెనక్కి తిరుగు, వెనక్కి తిరుగు' అని మంచానికి అతుక్కునే ప్రాణం తీసేవాడు. క్రమంగా వూరువేచూష్కోవాకి హంగుబాబు హమేషా యిబ్బంది అయ్యాడు.

కొన్నాళ్లకి సీను చివరి కొచ్చేసింది. నిర్మాత దర్శకుడు హంగుబాబు మంచంలోనే మూలుగుతూ మరణించాడు. చూడ్డానికి వచ్చిన కొద్దిమంది సినిమా పెద్దల సాయంతో అంత్యక్రియలకు హంగుబాబుని, చూష్కోవా దహనభూమికి తీసుకువెళ్లింది.

హంగుబాబు వెలిగి మండుతున్నాడు, అతడి రంగుల తెర రగిలిపోతున్నట్టు. హాజరైన కొద్దిమందీ నెమ్మదిగా సెలవు తీసుకోసాగారు.

చూష్కోవా చితికి తన వెన్ను చూపించకుండా వెలిగే చితివేపు చూస్తూ వెనక్కి అడుగులు వేస్తోంది. అనుకోకుండా ఆమె కాలు కాస్త పల్లంగా వున్న చోట పడి ఆమె కిందపడబోయింది. కానీ పడిపోకుండా వొకాయన ఆమెను పట్టుకుని, 'జాగర్తమ్మా! అంతా అయిపోయింది. ఇక బైల్దేరు. ఇటుగేటువైపు తిరిగి నడు - పడిపోవు' - అన్నాడు. ఆయనే గంగులు బాబా. ఆయన్ని చూసి చూష్కోవా 'థాంకుష్కా! స్వామిష్కా! కానీ నేను యిష్కాగే వెనష్కి నడుష్కాను. ఆ మండే ఫ్యూనరల్ ఫైర్‌కి నా వీపు చూపిష్కను. మీరు గ్రేటిష్కా అని మీ గురిష్కి హంగుష్కా మెనీ టైమ్స్ టోల్డుష్కా' అంది.

అప్పుడు గంగులు బాబు - 'నీ యిష్టం చూష్కోవా! కానీ మండే చితికి నీ వీపు యెందుకు చూపజాలవు?' అని అడిగాడు.

- అదీ విక్రమార్కా! విషయం. ఇప్పుడు చెప్పు. స్వామీ గంగులుబాబు అడిగిన ప్రశ్నకు వూరువో చూష్కోవా అనే రష్యన్ తెలుగు హీరోయిన్ యేమని బదులిచ్చింది? నా యీ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వెయ్యి చెక్కలయి హుష్కాకీ అయిపోతుంది." - అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు, - ఏవీలేదు బేతాళా! నిర్మాత దర్శకుడైన హంగుబాబుకి రష్యన్ తెలుగు హీరోయిన్ వూరువే చూష్కోవా యొక్క ముందు అందాలకంటే, ఆమె వెనుక అందాలే బాగా యిష్టం. అందుకే యెప్పుడూ ఆమెను 'వెనక్కి తిరుగు, వెనక్కి తిరుగు' అని సతాయించేవాడు.

స్వామీజీ గంగులు బాబుకి, చూష్కోవా యిచ్చిన సమాధానం యిది. 'స్వామిష్కా! నేను హంగుష్కా మండే చితికి నా వీపుష్కా, నా పిరుదుద్వయా చూపించకుండా వెనక్కి నడవష్కడాన్కి కారణష్యా చెప్పుష్కా! వన్స్ హంగుష్కా నాతో - 'మైడియర్ ష్కోవా! నా పాలకోవా! నిన్ను వెనకనుంచి చూష్కే, చచ్చిన వాడు కూడా ప్రాణంతో లేచొచ్చి నీ వెనకాల పడుష్కా' - అన్నాడు. హంగూకి ఎక్స్పైరీ డేటయిపోయిష్కా. నేను వెనక్కి తిరిగితే నన్ను వెనుకున్న్యంషి చూష్కి మళ్లీ బతికి లేచి నాక్కు పెర్మనెంట్‌గా నా వెనకాల్య అతుక్కుపోతాడ్ష్యా - దట్స్ వై నేను వెనక్కి నడిచాష్కా - నేను కిందపడకుండా పట్టుకుని హెల్ప్ షేసిన్యందుక్కు మెనీ మెనీ థాంకుష్కా స్వామిష్కా!' అని వివరంగా చెప్పింది. వూరువే చూష్కావాకి కర్మయోగం శ్రేష్టమైనదని తెలుసు.

సన్న్యాసః కర్మయోగశ్చ
నిశ్శ్రేయసకరావుభౌ!
తయోస్తు కర్మ సన్న్యాసాత్
కర్మయోగో విశిష్యతే||

-జ్ఞాన కర్మయోగములు రెండునూ మోక్షసాధనములైనా, వీటిలో జ్ఞానయోగముకంటె కర్మయోగము శ్రేష్ఠమైనది - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు.. "అని చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేస్కాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments